# తెగినతీగలు



జానకి స్నేహితురాలు పార్వతి, పార్వతి అన్నయ్యకూడా నాటకాలలో వేషాలు వేస్తుంటాడు.

ఈ రోజు వాళ్ళదే ఓ నాటకం ఉంది టౌనుహాల్లో.

పార్వతికి నాటకాలన్నా, సినిమాలన్నా తగని పిచ్చి. జానకికి సినిమాలన్నా, నాటకాలన్నా తలనొప్పి.

ఎలా అన్నాసరే జానకిని వాళ్ళన్నయ్యా వాళ్ళూ వేసే నాటకానికి తీసుకెళ్ళాలని పార్వతి పట్టుదల.

''నేను రాను మొర్రో'' అంటుంది జానకి. ''నా బదులు మా తమ్ముడిని తీసుకెళ్ళు. మా తల్లివి కదూ—నీ కెంతయినా పుణ్యం ఉంటుంది, న న్నెందుకు చంపుతావు గాని'' అని బ్రతిమాలింది, విసుక్కుంది, చిరాకు పడింది. అయినా, పార్వతి విడిచి పెట్టలేదు. ఆ అమ్మాయి పట్టుదల, జానకిని నాటకం హాల్లో కూర్చోపెట్టాలని.

''జానకి నాటకానికి రా''దని ఓ అమ్మాయీ, ''వస్తుంది. కావలిస్తే పందెం వేయి'' అని పార్వతీ పందెం వేసుకున్నారు. జానకి నాటకానికి రాకపోతే తను ఓడిపోవాలి. అలా ఓడిపోయి అవమానానికి గురవడం ఆ అమ్మాయికి ఇష్టం లేదు.

నాటకాల్లో వేషాలు వేసేవారి మీద జానకికి మంచి అభిప్రాయం లేదు. 'వాళ్ళ అందం ఆ లైట్ల వెలుతురులోనే. పగలు వాళ్ళని చూస్తే డోకొస్తుంది కూడా'' అని నాటకాల్లో వేషాలు వేసే వాళ్ళను ఎద్దేవా చేస్తుంటుంది.

నాటకాలను, సినిమాలను పిచ్చిగా చూసే పార్వతి అందులో నటించే వాళ్ళనుకూడా పిచ్చిగా ఆరాధిస్తుంటుంది. ఎప్పటికన్నా సరే జానకి చేత 'వేషాలు వేసే నటులుకూడా అందంగానే ఉంటారు సుమా' అనే మాట అనిపించాలని మనసులో కాంక్ష. అందుచేత కొంత రమ్మని ప్రాధేయపడసాగింది.

పార్వతి బ్రతిమాలగా బ్రతిమాలగా కొన్ని షరతులతో ఆ నాటకానికి రావడానికి అంగీకరించింది జానకి.

ఆ షరతులు ఏమిటంటే? తను నాటకం చూస్తున్నదో, నిద్ర పోతున్నదో పార్వతి పట్టించుకో కూడదు. భుజం మీద గిచ్చి నిద్రాభంగం చేయకూడదు. నిద్ర వచ్చేవరకూ తనకు విసుగు పుట్టకుండా ఏ కూల్‌డ్రింకో లేదా మిరపకాయబజ్జీలో, చిప్సో పార్వతి ఖర్చుతోనే ఇప్పించాలి. ఇవీ ఆ షరతులు.

అన్నిటికీ సంతోషంగా ఒప్పుకుంది పార్వతి. జానకి రావడానికి ఒప్పుకుంది— అది చాలదూ తనకి?

ఇద్దరూ వెళ్ళి స్టేజికి దగ్గరగా ప్రత్యేకంగా అమర్చిన కుర్చీలలో కూర్చున్నారు. తెర లేవకముందే జానకి బద్ధకంగా ఆవులించింది. ఇబ్బందిగా కదిలింది కుర్చీలో. ''ఎందుకొచ్చిన బాధ నాకు? ఇంట్లో హాయిగా నిద్ర పోక'' అని విసుగ్గా గొణుక్కుంది. 'నా కోసం రాలేదు. మిత్రురాలి కోసం వచ్చానుగాని' అని సమాధానపడింది.

తెర లేచింది. స్టేజి మీదకు హీరో వచ్చాడు. అతను చాలా అందంగా ఉన్నాడనిపించింది జానకికి. 'అదంతా మేకప్ లోని గొప్పలే' అనుకుంది చిరాకుగా.

''అతను మా అన్నయ్య ఫ్రెండు.'' పార్వతి చెవి దగ్గర గొణిగింది చిన్నగా.

''అలాగా! ఇతన్ని పగ లెప్పుడన్నా చూశావా?'' జానకి గొంతులోని వ్యంగ్యానికి ఒళ్ళు మండుకొచ్చింది పార్వతికి. ''నీ కంటే చాలా అందంగా ఉంటాడు'' అంది.

''ఊఁ'' అన్న జానకి ఇంకేమీ అనకుండా నాటకం చూడటంలో నిమగ్నమయింది. మధ్యలో ఒకటి రెండు సార్లు పార్వతి ఏదో చెప్పబోయింది గాని—''అబ్బ! ఉండవోయ్, మధ్యలో డిస్టర్బ్ చేయకు'' అని వారించింది జానకి. ''హీరో గొంతు చాలా స్వీట్‌గా ఉంది కదూ? అతను కూడా బాగున్నాడులే'' అని ఆమె మెచ్చుకుంది కూడా.

నాటకం పూర్తయి అందరూ లేస్తుంటే—''అప్పుడే అయిపోయిందా!'' అంది జానకి.

''ఆ హీరో వేషధారి నీకు తెలుసన్నావు కదూ? కాస్త నాకు పరిచయం చేస్తావా?'' అని కూడా అడిగింది.

''నాకు నాటకాలంటే అసహ్యం. అందులో వేషం వేసేవారంటే మరీ అసహ్యం'' అనే జానకి ఆ నాటకాన్ని, అందులో హీరో వేషం వేసిన వ్యక్తిని మెచ్చుకోవడమే గాక, అతణ్ణి పరిచయం చేయమని అంటుంటే విస్తుపోయింది పార్వతి. ''అదేదో నవలలో ఇలాగే మొదట నాటకాలు ఇష్టపడని వ్యక్తి నాటకంలోని హీరోయిన్‌ని గాఢంగా ప్రేమించికూర్చుంటాడు హఠాత్తుగా. ఆ తర్వాత ఆమెను మరిచిపోయి మరో అమ్మాయిని పెళ్ళి చేసుకుంటా డనుకో! కొంపదీసి నువ్వు కూడా అలా...'' తతిమ్మా మాటని పూర్తిచెయ్యకుండా అల్లరిగా నవ్వింది పార్వతి.

పార్వతి మాటలకు సిగ్గు పడలేదు జానకి. ''అతను మగవాడు కాబట్టి మధ్యలో మరిచిపోగలిగాడు. నేనైతే ప్రాణం ధారపోస్తాను కాని, మనసిచ్చిన మనిషిని మరిచిపోను'' అంది టక్కున.

నాటకం చూడడానికి వచ్చిన జనం ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు.

గ్రీన్ రూమ్స్ చాలా హడావిడిగా ఉంది. ''నీవు ఫలాని డైలాగు సరిగా చెప్పలేకపోయావు'' అనో, ''మరికాస్త మృదువుగా చెప్పవలసింది'' అనో విమర్శించుకుంటున్నారు ఒకర్నొకరు.

గుమ్మం దగ్గర నిలుచుని అడిగింది పార్వతి, ఎవరో ఇవతలకు రాబోతుంటే— ''మా అన్నయ్య ఉన్నాడాండీ లోపల?'' అని.

''మీ అన్నయ్య ఎవరమ్మా? ఆయన పేరేమిటి?'' అన్నా డతను, ఆ ఇద్దరు ఆడపిల్లల వైపు సంభ్రమంగా చూస్తూ.

''ప్రకాశరావుగా రండీ! ఇంటి తాళం చేతులు అన్నయ్యదగ్గరఉండిపోయాయి.'' తను చెప్పింది పచ్చి అబద్ధమని పార్వతికి తెలుసు. గ్రీన్ రూమ్‌లో వెళ్ళాలంటే అంతకుమించి మరో మార్గం లేదు మరి. జానకి ఆ హీరోని చూస్తేనే గాని వీల్లేదంటూ కూర్చుంది.

అన్నగారి దగ్గరి కెళ్ళినట్లు వెళ్ళి ఆ హీరోని చూపెట్టాలనే జానకిని వెంటబెట్టు కొచ్చింది పార్వతి.

**మంచిగా మాట్లాడడం ఒక విధమైన మంచి పని. ఏమైనా మాటలు మాత్రం చేతలు కావు.**
**—షేక్స్‌పియర్**

''అరే! ప్రకాశరావుగారి చెల్లెలివా? ఆయన ఇప్పుడే బయటి కెళ్ళారే? వచ్చే వరకూ అలా కూర్చోండమ్మా.'' అతను వాళ్ళిద్దరినీ గ్రీన్ రూమ్‌లోకి తీసుకెళ్ళి ఓ పెడగా కూర్చోపెట్టి వెళ్ళిపోయాడు.

''అన్నయ్య మీద భక్తి, ఆడపిల్లల మనే అభిమానమూను'' అంది పార్వతి గుసగుసలుగా.

మొహాల నున్న రంగులను పాడి గుడ్డలతో తుడుచుకుంటున్న వాళ్ళకి చాలా భిడియంగా ఉన్నది వయసులో ఉన్న ఇద్ద రాడపిల్లలు అలా తమని గమనిస్తూ కూర్చోవడం. 'వాళ్ళకు సిగ్గు లేదా' అనుకోసాగారు.

'వాళ్ళు ప్రకాశం గారి సిస్టర్స్ అట. ఇంటి తాళం చెవికోసం కూర్చున్నారు, పాపం' అని సమాధాన పడుతున్నారు.

''ఆయనే హీరో వేషం వేసింది.'' లేచి నిలుచుంటూ అంది పార్వతి. అతణ్ణి చూడగానే జానకి గుండెలు వేగంగా స్పందించసాగాయి. మేకప్ తుడిచేసుకుని మామూలు డ్రెస్‌లోనే ఉన్నా డతను.

పార్వతిని చూస్తూనే దగ్గరగా వచ్చి, ''నాటకానికి వచ్చారా?'' అని అడిగాడు.

అవునన్నట్లు తల ఊపింది పార్వతి.

''ఈ అమ్మాయి ఎవరూ?''

''నా ఫ్రెండు, పేరు జానకీదేవి.'' పరిచయం చేసింది పార్వతి. ఇద్దరూ ప్రతి నమస్కారాలు చేసుకున్నారు.

అతను తల ఎత్తి సూటిగా తన వైపే చూస్తుంటే జానకి చాలా సిగ్గుపడింది. మనసు కూడదీసుకుంటూ తడబడే స్వరంతో అంది — ''మీరు చాలా బాగా నటించారు'' అని.

''అలాగా'' అని అంతలోనే ఏదో స్ఫురించినట్లు—''వట్టి ప్రశంసలేనా లేక బహుమతి లాంటిది ఇవ్వడం ఉందా'' అన్నా డతను కొంటె నవ్వుతో చిలిపిగా.

జానకి వ్రేలి నున్న ముత్యపు ఉంగరం తీసి అందిస్తూ, ''ఇదే నా బహుమతి'' అంది.

తను సరదాకి అన్న మాటకు ఆ అమ్మాయి నిజంగానే వ్రేలి నున్న ఉంగరం తీసి ఇవ్వబోతుంటే అతను కంగారు పడ్డాడు.

''నేను సరదాకి అన్నాను. అంతే'' అని వారించబోయాడు కాని, జానకి వినలేదు. ''నేను నిజంగానే ప్రజెంట్ చేస్తున్నాను. ఇది నా సంతోషం కొలదీ ఇచ్చే చిన్న కానుక. అంతేను. ఈ చిన్న కానుకతో మీ నటనకు విలువ కట్టుతున్నానని అనుకోకండి, మీరు తిరస్కరిస్తే నేను నొచ్చుకుంటాను'' అంది గబగబ.

పార్వతి తన మిత్రురాలి సాహసానికి, వాక్చాతుర్యానికి విస్తుపోయింది ఓ క్షణం. అంతలోనే ఏదో స్ఫురించిన దానిలా— ''తీసుకోండి, రామంగారూ, నా ఫ్రెండు తృప్తికోసమన్నా మీరు తీసుకోక తప్పదు'' అంది.

ఆడపిల్లలు అంతగా బ్రతిమాలుతుంటే తనింకా బెట్టుచేయడం బాగుండదని జానకి చేతిలోంచి ఉంగరం తీసుకుని వ్రేలికి పెట్టుకున్నాడు అతను.

కాస్సేపు ఆ మాటా, ఈ మాటా చెప్పుకుంటూ కూర్చున్నారు.

''అడుగో ప్రకాశరావు'' అన్నా రెవరో.

''వస్తా''మంటూ లేచారు జానకీ, పార్వతీను.

ఇంటికెళ్ళి పడుకున్నా, జానకికి రామమే గుర్తు రాసాగాడు. కంటికి నిద్ర దూరమైపోయింది.

'ఛ! ఈ రోజు నా కేదో దయ్యం పట్టింది. లేకపోతే ఈ చపలత్వం ఏమిటి?' అనుకుంది, మనుసుని అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తూ. కాని, మనసు కోతి వంటిది. అది వద్దన్న పనే చేస్తానంటుంది.

జానకి ఎంత ప్రయత్నించినా, ఆ నాటకాల మనిషి రూపమే మనోనేత్రం ముందు తారట్లాడ సాగింది.

'అతను చాలా అందంగా ఉన్నాడు. ఆ గొంతు ఎంత మధురంగా ఉందో, ●

నవ్వు సెలయేటి గలగలలా అంత హాయిగా ఉంది.' మనసునిండా ఆక్రమించుకున్న ఆ రూపాన్ని తలుచుకుంటూ ఎప్పటికో నిద్రపోయింది.

ఆ మరునాడు పార్వతివాళ్ళ ఇంటి కెళ్ళింది జానకి. ఆ అమ్మాయిని చూస్తూనే, "నీ కోసమే చూస్తున్నాను" అంది పార్వతి.

"ఏమిటి విశేషం? ఎక్కడికన్నా వెళ్ళాలా? వెళ్ళబోతున్నావా? వెళ్ళి వస్తున్నావా?" అడిగింది నవ్వుతూ.

"వెళ్ళబోతున్నాను, నువ్వూ వస్తావా?' అంది పార్వతి.

"ఎక్కడికి?"

"టౌను హాలుకి, ప్రైజ్ డిస్ట్రిబ్యూషను ఈ రోజు."

"ఆఁ వాళ్ళను చూసేదేమిటిలెద్దూ! నేను రాను." అడ్డంగా తల ఊపి తన అయిష్టాన్ని వ్యక్తంచేసింది జానకి.

"నీ అభిమాన నటుణ్ణి చూడటానికి రావా?" అంది పార్వతి.

"నా అభిమాన నటుడా!" తెల్లబోయింది జానకి.

"ఉంగరం ప్రజెంట్ చేశావు కూడా అతనికి ..." కొంటెగా నవ్విం దామె.

"ఓ! అతను కూడా వస్తారా? అయితే, వస్తాను."

"వాళ్ళూ మీలాంటి మనుషులే. వాళ్ళను చూసేదేమిటి?" అన్నా రెవరో వెనకాలనుంచి.


జానకి ఉలిక్కిపడి తిరిగి చూసింది. గుమ్మానికి అడ్డంగా నిలబడి నవ్వుతున్నాడు రామం. అనుకోకుండా అతను కనిపించినందుకు మనసులో ఎంతో సంతోషం, స్త్రీ సహజమైన సిగ్గుతో మొహం కందిపోగా చప్పున మొహం వాల్చుకుంది జానకి. 'అయిందా అమ్మాయి గారి పని' అన్నట్లు అల్లరిగా నవ్వింది పార్వతి.

సూదిపడినా వినిపించేంత నిశ్శబ్దంగా మారిపోయింది వాతావరణం. ఆ నిశ్శబ్దాన్ని చెదరగొట్టుతూ రామమే మాట్లాడాడు మొదట — "నేను రావడం మీ ఫ్రెండుకి ఇష్టం లేనట్లుంది. పైగా నాటకలన్నా, నటులన్నా ఇష్టం లేదనుకుంటా. అయితే, నేను వెళుతున్నా" అని.

ఆ మాటకి కంగారుగా చూసింది జానకి తల ఎత్తి.

"ఇప్పుడిప్పుడే ఇష్టపడుతున్నది, రామంగారూ! కూర్చోండి ఇలా, అమ్మకి చెప్పి వస్తా" అంటూ జానకి వారించే లోపలే తుర్రుమం దక్కడి నుంచి పార్వతి.

తనని ఒంటరిగా విడిచిపెట్టి వెళ్ళినందుకు పార్వతిమీద ఎంతయినా కోపం వచ్చింది కాని, ఏం చేస్తుంది?



ఆలయ ప్రాంగణం ఫోటో — ఎస్. తిప్పేస్వామి (మైసూరు–1)

ఇబ్బందిగా కదిలింది కుర్చీలో.

"మీకు మాటలు రావా? అలా మూతి బిగించి కూర్చుంటే చెట్టంత మనిషిని వేసేంగాను!" అన్నాడు రామం.

జానకి మరింత ముడుచుకుపోయింది గాని, పెదవి కదల్చలేదు.

"మాట్లాడితే మీ నోటి ముత్యాలు రాలిపోతాయని భయం కాబోలు. పోనీలెండి. ఆ ముత్యాలు భద్రంగా దాచుకోండి. కాని, ఇదిగో, నిన్న మీరు పారేసుకున్న ఉంగరం, మీది మీకు అప్పజెప్పాలని వచ్చాను." అతను చేతిని ముందుకు చాపాడు తీసుకోండి అన్నట్లు.

"అది ... అది. పారేసుకోలేదు, మీ కిచ్చాను" అంది తడబడుతూ జానకి.

"ఒకరి వస్తువులు తీసుకోవడం నా కిష్టంలేదు." అతను గంభీరంగా చూస్తూ జానకి దగ్గరగా వచ్చాడు.

జానకి గుండెలు విపరీతమైన వేగంతో కొట్టుకోసాగింది. అక్కడి నుంచి లేచి పారిపోవాలనుకుంది కాని, కాళ్ళు చచ్చుపడినట్లు కదిలాయి కాదు. నిస్సహాయంగా, బేలగా చూసింది. ఆమె కలలో కూడా ఊహించని విధంగా, రామం ఆమె కుడి చేయి పట్టుకుని వ్రేలికి ఉంగరం తొడిగాడు. అతని చేతిలోంచి తన చేతిని లాక్కోవాలని చూసింది గాని, వృథమైన అతని గుప్పిట్లోంచి తన చేతిని లాక్కోవడం అంత తేలిక కాదనిపించి, చేసేది లేక చూస్తూ నిలబడిపోయింది.

రామం ఆమె చేతిని వెంటనే విడిచిపెట్టలేదు. అలా పట్టుకొని కొన్ని క్షణాలు నిలబడిపోయాడు.

"నా చేయి విడిచిపెట్టండి, ఎవరన్నా చూస్తే బాగుండదు" అంది జానకి, వణికే స్వరంతో చిన్నగా.

అతను ఆమె చేతిని గుండె దగ్గరగా అదుముకుని ఏదో చెప్ప నుద్యుక్తుడయ్యాడు కాని, దూరంగా పార్వతి మాట వినిపించి చటుక్కున ఆమె చేతిని వదిలేశాడు.

"అరే! అలాగే నిలబడి ఉన్నారా? కూర్చోండి, రామంగారూ" అంటూ వచ్చిన పార్వతి ఇద్దరికీ చెరో కాఫీ గ్లాసు అందించింది.


"మీ ఫ్రెండుకి మాటలు రావా?" అన్నాడు రామం, కాఫీ త్రాగుతూ.

"మా ఫ్రెండు నోరు విప్పి మాట్లాడదు. అంతా కళ్ళతోనే మాట్లాడుతుంది ఎక్కువగా. చూడండి, ఎలా చూస్తున్నదో నమలకుండా మింగేసేలా."

భయం నటిస్తున్న పార్వతిని చూసి ఫక్కున నవ్వేసింది జానకి.

ప్రకాశం రాగానే రామం, అతనూ కలిసి బయటి కెళ్ళిపోయారు.

రామం వెళ్ళిపోయాక మరక్కడ ఉండ బుద్ధి కాలేదు జానకికి. అతనితో మరి కాస్సేపు మాట్లాడుతూ కూర్చోవా లనిపిస్తున్నది కాని, అతను వెళ్ళిపోయాడు. అతను ఎదురుగా ఉన్నంతసేపూ పాడు సిగ్గు తల ఎత్త నిచ్చింది కాదు. ఇప్పు



దిగులు    చిత్రం — యమునాబాయి (మద్రాసు-49)

డేమో 'అయ్యో!' అని మూలుగుతున్నది మనసు.

అతను తాకిన చేతిని ఆప్యాయంగా చూసుకుంది. అలా చూడటంలో దృష్టి ఉంగరం మీద పడుతూనే నిర్ఘాంత పోయింది. ఆ ఉంగరం తనది కాదు. ఎనామిల్ రాయి మీద 'ఆర్' అనే అక్షరం ఉన్న మరో ఉంగరంగా గుర్తించి ఆమె గుండె జల్లుమం దొక్కసారిగా. ఎంత తెలివిగా ఉంగరం మార్చాడో! బుగ్గల్లోకి వెచ్చటి ఆవిరి వచ్చింది. సిగ్గు బరువుతో కళ్ళు వాలిపోయాయి. ఓరగా జానకిని గమనిస్తున్న పార్వతి కొంటెగా నవ్వుతూ, "ఉంగరాలు మార్చు కున్నారు. మరి పూల దండలు ఎప్పుడు మార్చుకుంటారేం?" అంది.

"అలా మాట్లాడితే నాకు కోసం వస్తుంది. ఇంకెప్పుడూ మీ ఇంటికి రాను" బుంగమూతి పెట్టి అలక నటిం చింది జానకి.

"ఇంక నా అవసరం ఎందుకుంటుం దిలే, నీకు అవసరమైన వాళ్ళు దొరి కారుగా!" ఏడిపించడంలో పార్వతిది అందె వేసిన చేయి.

"అత్తా! చూడు పార్వతి." అక్కడి నుంచి పారిపోయింది జానకి.

*    *    *

"అతను నాటకాల మనిషి. అతనికి, మనకి ఎలా పొసుగుతుందోయ్?" అన్నారు దశరథరామయ్యగారు మొహం చిట్లించి, ఆ సంబంధం తనకి ఏ మాత్రమూ నచ్చలేదనే భావాన్ని ఒక్క వాక్యంలో వ్యక్తం చేస్తూ.

"మేమంతా నాటకాల మనుష్యులం కామా? పెళ్ళి చేసుకోలేదా? పెళ్ళాం బిడ్డల్ని చూసుకోవడం లేదా?" మధ్య వర్తిగా వచ్చిన ప్రకాశం అన్నాడు.

"అబ్బాయి బి. ఎ. వరకు చదువు కున్నాడు. ఉద్యోగం చేస్తేనే గాని బ్రతుకు తెరువు లేదు అనే బాధ లేదు. తాత, తండ్రి ఆర్జించిన ఆస్తి బోలెడంత ఉంది. ఒకరికి పెట్టగలడేగాని, ఒకరిని యాచించవలసిన అవసరం రాదు. ఇక పోతే, నాటకాలు హాబీకోసం వేస్తుం టాడు. అంతేగాని, అదే జీవనభృతి కాదు. వాడికి మీ అమ్మాయి నచ్చింది ఎన్నో సంబంధాలు వేల రూపాయలతో రాబో తున్నా, తిరస్కరించి మీ అమ్మాయే కావాలంటూ కూర్చున్నాడు. మీరు అంగీకరిస్తే మంచిదని నా అభిప్రాయం." చివరి మాటగా చెప్పి లేచా డతను.

"అయినా, అమ్మాయిని కూడా అడిగి చూడండి ఓ సారి" అన్నాడు. రామాన్ని చేసుకోవడానికి జానకి తప్పకుండా ఒప్పు కుంటుందని పార్వతి నమ్మకంగా చెప్ప బట్టే పెద్దరికం మీద వేసుకుని మధ్య వర్తిగా వచ్చాడు. ఈయన చూస్తే 'నాటకాలవాడికి మా పిల్లని ఈయం' అనే ధోరణి చూపిస్తున్నాడు.

"ఏమంటావమ్మా? నీ ఇష్టం చెపితే ముహూర్తం పెట్టిస్తాను" అని తండ్రి అడిగినప్పుడు— "మీ ఇష్టం, నాన్నా" అంది నవ్వేస్తూ జానకి.

"అతనితో జీవితాన్ని పంచుకునేది నీవు. నీ పూర్తి అంగీకారం కావాలిప్పుడు." మళ్ళీ మళ్ళీ రెట్టించాడు తండ్రి. "తనకి అంగీకారమే" అని చెప్పి మరి అక్కడ నిల్చోకుండా లోపలికి పరుగెత్తిం దా అమ్మాయి.

దశరథరామయ్యగారికి ఒప్పుకోక తప్పింది కాదు. ఆ నెలలోనే జానకి, రామం దంపతులయ్యారు. హనీమూన్‌కి ఉత్తరాదంతా తిరిగి వచ్చారు.

జానకికి రోజులు ఆనందంగా గడిచి పోతున్నాయి. వైవాహిక జీవితం ఇంత మధురమైనదా అని లోలోపల మురిసి పోయేది.

మనసు సంతోషంగా ఉన్నప్పుడు రోజులు నిమిషాల్లా దొర్లిపోతున్నట్లుం టాయి. అవే రోజులు విచార సమ యంలో దీర్ఘంగా, బరువుగా గడుస్తాయి.

భర్త సాన్నిధ్యంలో జానకికి రోజులు నిమిషాల్లో దొర్లిపోవడంలో వింతేముంది? కోరుకున్న భర్త, కోరి చేసుకున్న భర్త. దేనికీ కొరతలేని సంసారం. ఇంతకన్నా ఆడదానికి కావలసిం దేమిటి అని తన అదృష్టాన్ని తలుచుకుంటూ మురిసి పోయే దామె.

రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవు.

వివాహమైన ఆరు నెలల వరకూ నాటకాల జోలికి పోని రామం "ఏ వ్యాపకమూ లేక బోరు కొడుతున్న" దంటూ తిరిగి నాటక సమాజంలో చేరాడు.

'మగవాడికి ఏదో వ్యాపకం ఉండాలి. లేకపోతే వాళ్ళకి జీవితం నిస్సారంగా ఉంటుంది' అని సమాధానం చెప్పుకుంది జానకి.

రామంకోసం ఎవరో ఒకరు రావడం, కూర్చుని ఏ నాటకం బాగా రాణిస్తుంది, ఏ ఊళ్ళో ప్రదర్శిస్తే గిట్టుబాటు అవుతుంది, దానిలోకి ఎలాంటి పాత్ర దారులను ఎన్నుకోవాలి అంటూ చర్చించు కోవడం, లేదా రిహార్సల్‌కి అంటూ అతనే వెళ్ళిపోవడం తరుచూ జరుగు తున్నది.

మొదట్లో భర్త పాల్గొనే నాటకా లకు తనూ వెళ్ళేది జానకి. కాని, రాను రాను ఆ నాటకాలకు వెళ్ళడం కూడా తగ్గించుకుంది. లోగడ క్షణాల్లా గడిచి పోయిన కాలం ఇప్పుడు దీర్ఘంగా, బరు వుగా, విసుగ్గా గడుస్తున్నది జానకికి.

రామానికి క్షణం ఖాళీ ఉండటం లేదు. కొత్తగా నాటకాలను వ్రాయిం చడం, వ్రాసిన వాటిని చదివి సరిదిద్దు కోవడం, లేదా తనే స్వయంగా వ్రాయడం, కొత్త నటులను ఎన్నుకోవడం, వాళ్ళచేత డైలాగ్స్ చెప్పించడం, వాళ్ళకి తర్ఫీదు ఇవ్వడం, నాటకంకోసం థియేటర్లను బుక్ చేయడంవంటి పనులతో చాలా బిజీగా తిరుగుతున్నాడు.

భర్త ఏ వేళ కొస్తాడో భోజనానికి తెలియదు. ఒక్కోసారి అర్ధరాత్రి దాటినా రాడు. ఒక్కోసారి ఏ తెల్లవారు ఝామునో వచ్చి "ఆకలి లే"దనో, లేదా

"తిని వచ్చాను" అనో చెప్పి ఆవుట్నున మంచం మీద పడి నిద్రలో మునిగి పోయే భర్తను చూస్తుంటే కోపం, దుఃఖం కూడా ముంచు కొచ్చేవి జానకికి. 'ఏం మనిషో? ఈ నాటకాల పిచ్చిలో పడి వేళకు తిండీ, నిద్రా లేక ఎలా చిక్కి పోయారో' అని బాధపడేది. నెమ్మదిగా ఆమెలో అసంతృప్తి చోటు చేసుకో సాగింది.

అక్కడికీ ఉండబట్టలేక ఓ సారి అంది కూడా — "ఎందుకొచ్చిన నాటకాలు, ప్రాణానికి సుఖ శాంతులు లేక పోయాక? చూడండి, మీ రెలా చిక్కి పోతున్నారో" అని.

ఆ మాటకి తేలిగ్గా నవ్వేస్తూ, "నాటకాలు నా ఆరో ప్రాణం—తెలుసా? అన్నం అయినా మానేయ గలనేమోగాని, నాటకాలను దూరం చేసుకోలేనుసుమా" అన్నాడు. ఏమంటుం దిక జానకి?

ఈ మధ్య మరో బాధ వచ్చింది జానకికి. అదేమిటంటే, తన భర్తకోసం అమ్మాయిలు కూడా రావడమేను. వాళ్ళు వచ్చేది నాటకాల్లోని పాత్రల కోసమని తెలుసు. అసలు అనుమానం అంటూ రానేకూడదు. అది వచ్చిందా భూతం కింద మారి నెత్తిమీద ఎక్కి కూర్చుని ఎన్ని అనర్థాలన్నా చేయిస్తుంది. అయినా, భర్తను శంకించలేకపోతున్నది.

అగ్నిలో ఆజ్యం పోసినట్లు పక్క ఇంటి బామ్మగారి, ఎదురింటి పిన్నిగారి, మూడవ ఇంటి వదినగారి మాటలు మరి కొంత ఆమె హృదయాన్ని ఛిన్నా భిన్నం చేస్తున్నవి.

"ఈ నాటకాల వాళ్ళను నమ్మకూడ దమ్మాయ్! వాళ్ళ నో కంట కనిపెట్టుతూ ఉండాలి, చెయ్యి దాటిపోయారా మన మనుష్యులు కా రిక" అంటుంది పిన్ని గారు.

"మా పెద్దమ్మగారి అబ్బాయి ఇలాగే నాటకాల్లో తిరుగుతూ అందులో వేషం వేసే అమ్మాయిని లేవదీసుకునిపోయాడు. పదేళ్ళయింది, ఇంతవరకూ అయిపూ టజా లేదు. అతని భార్య పుట్టింట్లో ఉంది, పాపం!" అంటుంది మరో పొరుగింటి ఇల్లాలు.

"నాటకాలవాళ్ళ పెళ్ళాన్ని సరిగ్గా చూడ రమ్మాయ్! నెమ్మదిగా అబ్బాయిని ఆ వ్యాపకం నుంచి తప్పించు" అంటుంది బామ్మగారు. ఇటువంటి మాటలన్నీ వింటూంటే జానకికి నిజంగానే మతి పోతున్నది భయంతో.

కొంపదీసి తన భర్తా అలా చేస్తాడా?

'ఛ! ఆయ నటువంటి వారు కాదు. తనంటే ఎంతో ప్రేమ. ఆ నాటకాల పిచ్చి తప్పించి మరే చెడు అలవాటూ లేదు.' ఇలా సాగేవి ఆమె ఆలోచనలు.



పల్లెపడుచు — చిత్రం — వై. బాలయ్య (సిద్దిపేట)

"నాటకాలంటూ, రిహార్సల్స్ అంటూ వెళ్ళిపోతారు. ఇంట్లో ఒక్కర్తినీ ఉండలేక పోతున్నాను" అందో రోజున.

రాత్రి, పగలు జానకికి సహాయంగా ఉండడానికి ఓ పేద ముసలమ్మను కుదిర్చాడు రామం.

పగలంతా పిడిరాయిలా తిరిగిన మనిషి రాత్రి అయ్యేసరికి ఖళ్ళు ఖళ్ళున దగ్గుతూ, రాత్రంతా జాగరణ చేయడమే గాక జానకికి కూడా నిద్ర సుఖం లేకుండా చేసింది. నాలుగు రోజులకే బేజారెత్తి పోయిన జానకి కొంత డబ్బు ఇచ్చి, "దగ్గుకి మందు వాడి, అది పూర్తిగా తగ్గాక రా" అని ఆ ముసలమ్మను సాగ నంపింది.

ఈ మధ్య ఓ అమ్మాయి తరుచూ ఇంటికి వస్తున్నది, రామంతో గంటల తరబడి మాట్లాడుతూ కూర్చుంటుంది.

ఆ అమ్మాయిని ఓ కంట కనిపెడు తూనే ఉంది జానకి.

ఆ అమ్మాయిలో అందం, ఆకర్షణ కూడా ఉన్నాయి. అన్నిటినీ మించి మంచి వాక్చాతుర్యం కలదీను. తన భర్తా, ఆ అమ్మాయీ పక్కపక్కల కూర్చుని గంటల తరబడి హస్కు వేసుకోవడం జానకికి బొత్తిగా ఇష్టంలేదు.

'ఇది ఇల్లా, బజారా? అసలు ఆ పిల్ల సంసారుల పిల్లేనా? సంసారుల పిల్లయితే ఆ విరగబా టెందుకు? ఆ ఇకఇకలు, పకపకలు ఎందుకు—సిగ్గు లేకపోతే సరి.' పైకి అనే సాహసం లేక మనసులోనే కసిగా గొణుక్కునేది.

మొదట్లో ఆ అమ్మాయి చాలా వినయంగా ఉండేది. "అక్కయ్యగారూ" అని పిలుస్తూ కబుర్లు చెప్పేది. కాని, రోజులు గడిచే కొలదీ జానకి కనిపించినా మాటాడకపోవడం, అక్కడ అసలు మూడో వ్యక్తి లేనట్లే మసలడంతో జానకికి ఆ అమ్మాయి నిర్లక్ష్య ప్రవర్తన మీద ఎంతయినా కోపం వచ్చేది.

'నా ఇంటికి వచ్చి నన్నే అవమాని స్తున్నావా' అని లోలోపల ఈసడించు కునేది ఆ అమ్మాయిని.

తన భర్తా, ఆ అమ్మాయీ మాట్లాడు కుంటూ కూర్చుంటే పొరుగింటి ఇల్లాలు చెప్పిన మాటలే గుర్తు వచ్చేవి.

'కొంపదీసి ఇద్దరూ వెళ్ళిపోవడానికి ప్లాన్ వేయడం లేదు కదా?' మనసులో కుశంక.

మనసులో అనుమానం అంటూ చోటు చేసుకుంటే అది అంత తేలికగా పోదు.

అసలే కోతి, ఆ పైన కల్లు తాగింది, తరవాత నిప్పులు తొక్కింది అన్నట్లు అసలే ఇరుగు పొరుగు వాళ్ళ మాటలతో మనసు పాడుచేసుకున్న జానకిని ఆ అమ్మాయి రాకపోకలు మరింత బేజారెత్తిస్తున్నవి.

అక్కడికీ ఉండబట్టలేక—"పెళ్ళికాని పిల్లతో ఆ మంతనా లేమిటి?" అంటే— "పెళ్ళయిన అమ్మాయితో మాట్లాడితే ఆ అమ్మాయి మొగుడు తన్నడాని కొస్తాడు మరి" అని నవ్వే భర్తను ఏమనగలదు?

"ఆ అమ్మాయికి నాటకాల్లో వేషం వేయాలని ఉబలాటం. ముందు నాట కాల్లో ప్రవేశిస్తే తర్వాత సినీ ఫీల్డులో ప్రవేశం ఈజీ అని ఆ అమ్మాయి వెర్రి నమ్మకం. వెండితెర మీద ఓ వెలుగు



సాష్టాంగం

చిత్రం — శి. వి. శివన్నారాయణ (గంగవరం)

వెలగాలని అమ్మాయి ఆకాంక్ష" అన్నా డతను.

"నేనూ వేస్తాను నాటకాల్లో వేషం" అంది జానకి టక్కున.

ఆ మాటకి అదిరి పడ్డాడు రామం. "ఏమిటి—నువ్వా? నాటకాల్లో వేషం వేస్తావా? ఇలా నా వైపు చూసి చెప్పు?" భార్య భుజం మీద చెయ్యి వేసి తన వైపు తిప్పుకుంటూ అడిగాడు రామం.

"ఏం, వేయలేనా ఆమాత్రం వేషం? కనకారావుగారి భార్య వేయడం లేదా నాటకాల్లో వేషాలు? మీరు మహా నటులాయె, ఆమాత్రం నటన నాకు బోధించలేరా?" వణికే పెదవిని పంటితో నొక్కి పడుతూ అందామె.

"అందుకే భయం, ఈ అందాన్ని స్టేజీమీద చూసి ఎవరన్నా మోహించి ఏ ముత్యాల ఉంగరమో ప్రెజెంట్ చేసి నానుంచి లాక్కుపోతారేమోనని." అతను కొంటెగా నవ్వాడు.

"ఊఁ పోండి, నన్నేమీ వెక్కిరించ నక్కర్లేదు." కోపంతో చురచురా చూసింది జానకి.

"నిన్నొదిలి ఎక్కడికి పోతాను!" చటుక్కున భార్యను బాహువుల మధ్య బంధించి, పెదవుల మీద ముద్దుపెట్టుకున్నాడు రామం.

"ఇదొకటి నేర్చారు బాగా!"

"కోపంలో కూడా నీవు ముద్దొస్తావు."

'అన్నీ అబద్ధాలేను.' మనసులో కసిగా గొణుక్కుందామె.

"ఏం, మాట్లాడవు? కోపం వచ్చిందా వద్దన్నానని? నీకు కోపం, వచ్చినా సరే నువ్వు నాటకాల్లో వేషం వేయడం నా కిష్టం లేదు, జానకీ! నీ అందం నా ఒక్కడి సొత్తేను. అది అందరి ఎదటా పడితే నేను భరించలేను."

'హూఁ మగవాడు!' మనసులో అనుకున్న జానకి— "ఆ మాటే నేను అంటే మీరు వేయడం మానివేస్తారా?" అంది.

"అలా ఒక్కనాటికీ అనలేవు. ఓ వేళ అన్నా అది మనసులోంచి వచ్చిన మాట కాదని నాకు తెలుసు. మనల్ని కలిపింది ఆ నాటకాలే అని నీకు తెలియదా?" భర్త తన మాటకి ఏమాత్రమూ విలువ నివ్వకుండా నవ్వులాటగా భావిస్తుంటే జానకికి ఇంకేమనాలో తోచింది కాదు. 'నా భావాన్ని ఇంకెలా వ్యక్తం చేసేది?' అని లోలోపల మథనపడింది.

ఆ రోజు అలా పూర్తయింది. ఆమె మనసులో అనుమాన పిశాచం కదం తొక్కుతూనే ఉంది.

ఈ సారి వేయబోయే నాటకంలో సుభద్ర హీరోయిన్ వేషం వేస్తున్నదని చెప్పాడు రామం.

సాయంత్రం అయిదు కొట్టేసరికి సుభద్ర వచ్చేది రిహార్సల్స్‌కి.. వెళుతున్నా మంటూ ఆమెను వెంటబెట్టుకుని వెళ్ళి పోయే వాడు భర్త. ఆ వెళ్ళడం వెళ్ళడం తిరిగి ఏ అర్ధరాత్రి వేళకో ఇంటికి చేరుకునే వాడు. తన వస్తువుని తనకి కాకుండా ఎవరో తీసుకుపోతున్నట్లు విలవిల్లాడి పోయేది జానకి. ఆ మాటని పైకి వ్యక్తం చేయడానికి సంస్కారం అడ్డు వచ్చేది. 'నేను మరీ దిగజారిపోతున్నానా?' తనని తను అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నించి విఫలురాలైంది.

"ఆ అమ్మాయి మీ పక్కన ఏం బాగుంటుంది హీరోయిన్‌గా?" అంది ఓ సారి. "అంతకన్న మంచి పిల్ల దొరక లేదా మీకు?" అడిగింది డొంక తిరుగుడుగా.

"ఈ సారి కిలా పోనిద్దూ. తనకి నాయకి వేషం ఇమ్మని ప్రాధేయపడింది. పాపం, మేము వేయబోయే నాటకాన్ని చూడటానికి ఓ ఫిలిమ్ కంపెనీ నిర్మాత వస్తాడట. అతని దృష్టిలో తను పడితే తనకి సినిమాలో ఛాన్సు ఇస్తాడేమో అని ఆ పిల్ల భ్రమ. అదీ గాక నాటకం వేసే రోజు కూడా దగ్గర పడింది. ఇప్పుడు హీరోయిన్‌ని మారిస్తే చాలా అవస్థ పడాలి" అన్నాడు రామం.

ఆ మర్నాడు బామ్మగారు కాఫీ గుండ కోసం వచ్చి, "మీ ఇంటి కొస్తుందే పిల్ల? ఆ పిల్లాను, మీ ఆయనా రాత్రి సినిమా హాలు దగ్గర కనిపించారమ్మడూ" అని చల్లగా నిప్పు రగిల్చి వెళ్ళిపోయింది.

తనతో సినిమాకు రావడానికే తీరిక లేదనే ఆయన సుభద్రతో ఎలా వెళ్ళగలిగారో? కట్టుకున్న భార్య సరదాలు గుర్తించని మగవాడూ ఓ మగవాడేనా?' కోపంతో, రోషంతో, ఈర్ష్యతో ఆమె స్త్రీ హృదయం బుసలు కొట్టింది.


"మనం సరదాగా కలిసి సినిమాకు వెళ్ళి ఎన్ని రోజులో అయింది. ఈరోజు వెళదామా?" అడిగింది గోముగా.

"ఇప్పుడా? నాకు ఖాళీ లేదే, రేపు తప్పకుండా వెళదాము." అతను ఆగకుండా బయటి కెళ్ళబోతుంటే, జానకికి ఉక్రోషం ఆగింది కాదు. "ఈ జన్మంతా మీకు ఖాళీ ఉండదు. మీ బ్రతుకంతా నాటకాలతోనే సరిపోతుంది. మిమ్మల్ని కట్టుకున్న ఖర్మానికి గాను ఓ ముద్దూ, ముచ్చటా లేని బ్రతుకు నాది. అయినా, మిమ్మల్ని అని ఏం లాభం? అంతా నా దురదృష్టం. ఆ రోజు అందరూ బోధించారు నాటకాల వాడిని చేసుకుంటున్నావు, నీకు సుఖం ఉండదూ అని. ఆ మాట అక్షరాలా నిజమని ఇప్పుడు తెలిసి వస్తున్నది" అంది రొప్పుతూ.

భార్య మాటలు విని రామం స్థాణువులా నిలబడిపోయాడు. నిజంగానే భార్యకు కోపం వచ్చిందని గ్రహించాడు. గుమ్మం వరకూ వెళ్ళిన వాడు వెనక్కి వచ్చాడు. అప్పటికే జానకి లోపలికి వెళ్ళిపోయింది. ఆమె వెనకాలే లోపలి కెళ్ళా డతను. ఆమె భుజాల మీద చేతులు వేసి, కాస్త బలవంతంగానే తన వైపు తిప్పుకున్నాడు. జానకి మొహం కోపంతో, దుఃఖంతో కంది ఉన్నది.

"నేను నాటకాల్లో తిరగడం నీ కిష్టం లేదా?" అడిగాడు మృదువుగా. జవాబు చెప్పడం ఇష్టంలేనట్లు మొహం మరోవేపు తిప్పేసుకుంది జానకి. మనసు మాత్రం 'ఇష్టంలేదు, ఇష్టంలేదు' అని మూలిగింది.

"ఈ నాటకాలే మనల్ని పరిచయం



చేసి బంధం వేశాయి. పోనీ, ఆ సంగతన్నా జ్ఞాపకం ఉందా?" ఈసారీ పెదవి కదల్చలేదు జానకి. కాని, మనసులో మరో మనిషి 'అందుకే ఈ బాధ. ఆ రోజు ఆ నాటకమే చూడకపోతే మిమ్మల్ని చూసే అవసరమే ఉండేది కాదు. అప్పుడు పెద్ద వాళ్ళు తెచ్చిన సంబంధమే చేసుకునేదాన్ని. అప్పుడు నా కింత మానసిక క్షోభ ఉండేది కాదేమో' అంది కసిగా.

"ఈ ఒక్క నాటకంలోనూ వేసి ఇక నాటకాలకు గుడ్‌బై చెప్పేస్తాను. ఈ ఒక్కసారికిమాత్రం ఒప్పుకో. మధ్యలో నేను తప్పుకుంటే అవతల వాళ్ళకు ఎంత నష్టం వస్తుందో ఒక్కసారి మన సుంచి ఆలోచించు." అతను భార్యను ప్రసన్నురాలిని చేసుకోవాలని ప్రయత్ని స్తున్నాడు.

అతను బ్రతిమాలేకొలదీ ఆమె బిగుస్తున్నది.

బయటి నుంచి ఎవరో పిలిచారు — "రామంగారూ" అంటూ.

"అదిగో, పార్థసారధిగా రొచ్చారు నా కోసం." బిగబిగిసినట్లున్న భార్యను దగ్గరగా అదుముకున్నాడు. అటునుంచి ఎటువంటి రెస్పాన్సూ రాలేదు. ఒక ఆడదాని కారణంగా తన పేరుని చెడ గొట్టుకోవడం అతని కిష్టం లేదు. నిర్లక్ష్యంగా ఓ చూపు విసిరి, విసురుగా బయటి కెళ్ళిపోయాడు.

భర్త నిర్లక్ష్య ప్రవర్తనకు ఒళ్ళు మండిపోయింది జానకికి. ఉప్పెనలా ఎగదోసు కొచ్చింది ఆవేశం. ఆ క్షణం లోనే ఆ ఇంట్లోంచి వెళ్ళిపోవా లనుకుంది. కాని, అతనితో చెప్పే శాశ్వతంగా విడి పోవాలనుకుంది, చివరగా నిశ్చయాని కొస్తూ.

ఆ వెళ్ళడం వెళ్ళడం నాలుగు రోజుల వరకూ ఇంటికి రాలేదు రామం. ఈ నాలుగు రోజులూ నాలుగు యుగాల్లా గడిపింది జానకి.

అయిదో రోజున వచ్చా డతను. అతని తోబాటు మరో వ్యక్తి కూడా వచ్చాడు. అతను రామం మేనమామ కొడుకట, తన చెల్లెలు పెళ్ళి పిలుపుకోసం వచ్చాడు.

'మీరిద్దరూ పెళ్ళికి రావా'లంటూ కూర్చున్నాడు.

"ఆ రోజుకి వస్తాను, మీ చెల్లెల్ని తీసుకెళ్ళు" అన్నాడు రామం, కొన్ని రోజులు భార్య నలుగురి మధ్యా ఉండి వస్తే ఆమె మనసు మారుతుందేమో అనే ఆశతో.

మొదట నసేమీ వెళ్ళనంటూ కూర్చుంది జానకి.

"మీరన్నా రాకపోతే నేను వెళ్ళ" నంటూ కూర్చున్నా డతను. ఇక కాదన లేక అతనితో బయలుదేరిం దామె.

పెళ్ళికి వచ్చిన జనం జానకి చుట్టూ చేరారు—'రామం ఏరి కోరి చేసుకున్న భార్య ఎలా ఉంటుందో' అనే కుతూ హలంతో.

"కొన్నాళ్ళకి రామం సినిమా ఏక్టరై పోతా" డని ఒకరు, "అప్పుడిక మనతో అస్సలు మాట్లాడరు. ఏమమ్మా, వదినా, ఎప్పుడన్నా మా ఇంటి కొస్తే ఆదరిస్తావా లేక మొహం మీదే తలుపు వేసు కుంటావా?" అని మరొకరు అంటూంటే, ఏ ఆలోచనల నుంచి దూరంగా పారి పోవాలని వచ్చిందో, ఆ ఆలోచనలే ఉక్కిరి బిక్కిరి చేయసాగాయి ఆమెను.

"పెళ్ళికి రాలేకపోయాను క్షమించాలి" అంటూ మాతన వధూవరులకు శుభా కాంక్షలు టెలిగ్రామ్ ద్వారా పంపి ఊరుకున్నాడు రామం.


"అతనికి ఆ నాటకాలే లోకం కాబోలు. ఇక బంధువులు ఎవరూ అక్కర్లేదు కాబోలు! రేపు పిల్లా జల్లా బయలు దేరితే పెళ్ళి పేరంటాళ్ళకు ఎవర్నీ పిలవడు కాబోలు!" ఇలా తలో రకం గానూ విమర్శిస్తుంటే జానకి వినలేక పోయింది. భర్త రానందుకు లోలోపల బాధపడింది.

పెళ్ళికూతురుతో జానకిని పంపించా లని చూశారు. తన ఆరోగ్యం బాగా లేదని, మందు వాడుతున్నట్లు చెప్పి, ఆ పూటకు ఆగమని బ్రతిమాలినా వినకుండా బయలుదేరి అర్ధరాత్రి సమయానికి ఇంటికి చేరుకుంది జానకి. కాని, ఇంటి దగ్గర పరిస్థితి మరోలా ఉంది.

ఆ పూటకి భార్య రాదు కదా అనే ధీమాతో రామం కొంతమంది మిత్రు లకు పార్టీ చేశాడు. వారిలో ఆడవారు కూడా ఉన్నారు. అంతా హుషారుగా తిని, తాగి కిందా మీదా పడుతుండగా గుమ్మం ముందు రిక్షా దిగిన జానకి నిర్విణ్ణురాలయింది ఇంటి పరిస్థితి చూసి.

కలలోకూడా ఊహించని విధంగా భార్య రాకను చూసి అదిరిపోయాడు రామం. అతనికి మతి పోయినట్లయింది. అతిథులూ కంగారు పడ్డారు.

జానకి అయితే భర్త మీద కోపంతో, అసహ్యంతో ఉడికిపోసాగింది. మనిషి అసలు స్వరూపం ఇదన్నమాట! డబ్బు మనిషిని ఎంత పతనావస్థలోకి లాక్కు



శిల్ప ప్రతికృతి (లేపాక్షి) చిత్రం — వై. బాలయ్య (సిద్ధిపేట)

పోతుందో స్వయంగా చూస్తున్నందుకు బాధ. 'నే నెందుకు వచ్చాను? అప్పుడే భర్త పతనావస్థను కళ్ళారా చూడటానికే వచ్చానా?' మనసులో మూగవేదన.

పనిమనిషి యెదిపక్క ఇంట్లో ఉంటున్న ఆఫీసరుగారి గురించి చెప్పేది—'అతను భార్య దగ్గర లేని సమయాల్లో బజారు ఆడవాళ్ళని తీసుకొచ్చి, తాగి తందనాలాడతా'డని. కాని, ఆ మాటలు నమ్మేది 'కాదు తను. చదువూ, సంస్కారమూ గల వ్యక్తి అంత అసభ్యంగా ఎలా ప్రవర్తిస్తాడు' అని తన వాదం. "నిజం, అమ్మగారూ! మా లాంటి లేబరు వాళ్ళు వళ్ళిగ్గా చేసే పాడు పనుల్ని మీ లాంటి సదూకున్నారు దొంగసాటుగా సేత్తారు. మాకు, మీకు అదే తేడా" అనేది రామి. దాని మాటలు నిజమేనని ఇప్పు డనిపిస్తున్నది జానకికి. 'భార్యమీద ప్రేమ నటిస్తూ ఆ భార్య కాస్త కనుమరుగు కాగానే ఈరకమైన జీవితాన్ని కోరుకుంటాడన్నమాట మగమహారాజు!' జానకి మనసు జుగుప్సతో, ఏవగింపుతో నిండిపోయింది. మరక్కడ ఆగలేకపోయింది. దిగిన రిక్షాలోనే ఎక్కి కూర్చుంది. "స్టేషన్‌కి పోనియ్యి" అంది కరుకుగా. రామం ఉలుకూ, పలుకూ లేకుండా చూస్తూ నిలబడిపోయాడు. దొంగతనం చేస్తూ పట్టుబడిపోయిన దొంగలా అతను సిగ్గుతో, అవమానంతో లోలోపల బాధ పడుతున్నా డంత సేపూను. భార్య అలా తొందర పడుతుందని, అసలు వెళ్ళే ప్రయత్నం చేస్తుందని అతను ఊహించలేదు. ఊహిస్తే ఏం చేసేవాడో? బహుశా ఆమె దారి కడ్డం వెళ్ళి ఆమెను వెళ్ళిపోనివ్వకుండా ఆపు చేసేవాడేమో? కాని, ఇప్పు డిక ఏం చేయగలడు? ఏ మొహం పెట్టుకుని భార్య ఎదటికి వెళ్ళి నిలుచోగలడు?

కాని, అంతలోనే మనసులోంచి హెచ్చరింపు వినవచ్చింది. 'ఆడదాని కంత పొగరేమిటి? మగవాడు అనేక రకాల పోకిళ్ళు పోతాడు. అందరూ మడికట్టుకుని కూర్చున్నారా? ఈ మాత్రానికే అంత కోపమా? పోతే పోనియ్యి. నాలుగు రోజులు పోతే తనే కాళ్ళబేరానికి వస్తుంది. చూస్తూ ఉండు. అసలు తనంత తాను రావాలి కాళ్ళ దగ్గరకు. అంతవరకూ నేను రమ్మని పిలిచేదే లేదు. ఆ బిగింపెన్నాళ్ళో చూస్తాను' అనుకున్నాడు, గుండె రాయి చేసుకుని.

రోజులు గడుస్తున్నాయి. నెలలు పూర్తవుతున్నాయి. భర్త వస్తాడనే ఆశ జానకిలో సన్నగిలిపోయింది. భర్త దగ్గరినుంచి కనీసం ఉత్తరమన్నా రాదా అని ఎదురుచూసింది. రోజులు గడిచే కొలదీ అదీ నిరాశే అయింది.

తనే తొందరపడి వచ్చేసింది. అలా రాకుండా ఉండవలసింది. ఇప్పుడు తను కూడా లేదా—ఆయన విచ్చలవిడి ప్రవర్తనకు అడ్డూ, అదుపూ లేకుండా పోతుంది. మనిషి పెడదారులు తొక్కితే ఓర్పుతో అతన్ని సక్రమ మార్గంలో పెట్టాలి గాని, అలా గాలికి వదిలేస్తే. . . జానకిలో పశ్చాత్తాపం లాంటిది కలగసాగింది.

చాలాసార్లు కలం, కాగితాలు తీసుకుంది భర్తకు ఉత్తరం వ్రాయాలని. "నన్ను క్షమించండి. నేనే తొందర పడ్డాను, వచ్చి నన్ను తీసుకెళ్ళండి" అని సగం వరకు వ్రాసేది. అంతలోనే పౌరుషం తలఎత్తేది. 'ఛ ఛ! కాళ్ళబేరానికి వెళుతున్నావా? అప్పుడు నువ్వెంత లోకువయిపోతావో గ్రహించావా? అతనే వస్తాడు నీ దగ్గరకు. రాక ఎక్కడికి వెళతాడు? తప్పకుండా వస్తాడు. నిన్ను అనునయిస్తాడు. అంతవరకూ ఓపిక పట్టు' అని బోధించేది.

వ్రాసిన కాగితం ముక్కలయ్యేది.

నెలలు గడుస్తున్నాయి. భార్యాభర్తల్లో పట్టుదలలు తగ్గిపోయాయి. ఒకరి రాక కోసం మరొకరు ఎదురు చూడసాగారు. తన ప్రాణానికి ప్రాణమైన భార్య లేని ఇల్లు దేవుడు లేని మందిరంగా, దీపం లేని భవనంగా శూన్యం నింపుకుని వెలా తెలా పోతున్నట్లుగా ఉంది రామానికి. వెళ్ళి తీసుకు రావాలని ఉంది. కాని, మగాడిని— వాళ్ళు పిలవకుండా ఎలా వెళ్ళను? వెళితే ఎందుకొచ్చావు? ఏ మొహం పెటుకుని వచ్చావు అని మామగారు తూలనాడతారేమో? అవమానిస్తారేమో అనే భావం కాళ్ళకు, మనసుకి కళ్ళెం వేస్తున్నది. ఈ వేళ వస్తుంది ఉత్తరం. రేపొస్తుంది' అని ఆశగా ఎదురు చూస్తున్నా డతను.

'ఆడదానికే అంత పట్టుదల ఉంటే, మగవాడివి నీ కెంత ఉండాలి? అసలు నీ తప్పేం ఉంది? తనంత తను వెళ్ళింది, తనే వస్తుంది తిరిగి. అంతవరకూ ఓపిక పట్టలేవా?' అంటున్నది పురుషాహంకారం, సడలిన పట్టుదల తిరిగి బిగవసాగింది.

• • •

ఇరుగు పొరుగు వాళ్ళకు జానకి మంచి కాలక్షేపంగా ఉంది చెప్పుకోవడానికి.

"దశరథరామయ్యగా రమ్మాయి

మొగుణ్ణి వదిలేసి వచ్చేసింది కాబోలు? అయినా, నాటకాల మనుష్యులు భార్యలను సరిగ్గా చూడరట. బహుశా ఇద్దరూ కీచులాడుకున్నారు కాబోలు" ఇలా సాగేవి వాళ్ళ మాటలు. వాళ్ళ మాటలు జానకి చెవుల్లో కూడా పడుతున్నవి కాని, గుండె రాయి చేసుకున్నందున వారి మాటలకు బాధ పడడంకూడా మరిచి పోయింది.

ఆ రోజు జానకికి ఒంట్లో బాగా లేక పడుకుంది. మధ్యాహ్నం టపాలో జానకి పేర కవరు ఒకటి వచ్చింది. దాన్ని తెచ్చి మంచం మీద పెట్టి, "నీకు ఏదో వచ్చిం దమ్మాయ్" అంది తల్లి.

"ఊఁ" అందే కాని, జానకి దాన్ని తెరిచి చూడలేదు. బహుశా ఏ ఫ్రెండో వ్రాసిఉంటుందిలే అనుకుంది నిర్లక్ష్యంగా. ఈ మధ్య తనకి ఫ్రెండ్సు దగ్గరి నుంచి ఉత్తరాలు రావడం ఎక్కువయింది. కాలం గడవక కాలక్షేపం కోసం తనే పాత మిత్రులందరికీ పేరు 'శీరునా' ఉత్తరాలు వ్రాయడం మొదలుపెట్టింది. వాళ్ళ దగ్గరినుంచికూడా వచ్చేవి తరుచూ.

ఇప్పుడు వచ్చిందికూడా ఆ బాపతు లెటరే అయి ఉంటుందిలే అనుకుం దామె. అందుకే చూడవచ్చులే అనుకుంది నిర్లక్ష్యంగా.

మర్నాడు సూత్రాలతాడు పెరిగి ఓ సూత్రం పడిపోయింది. ఎక్కడో దాని కోసం మంచం మీద - వెదుకుతుండగా అంత క్రితం రోజు తన పేర వచ్చిన ఉత్తరం కనిపించింది. కవరు మీద పరిచయమైన దస్తూరి చూడగానే ఆమె గుండె ఝల్లుమంది. మనసులోఆనందరేఖ తల ఎత్తింది.

తన దగ్గరినుంచి ఇన్నాళ్ళకి వచ్చిం దన్నమాట ఉత్తరం! ఆత్రతగా ఉత్తరం తెరిచి చదవసాగింది జానకి. ఆ ఉత్తరం పూర్తిచేయగానే ఆమె మొహం వివర్ణమయింది. "అమ్మా!" పిలిచింది కాతర స్వరంతో. వంట ఇంట్లోంచి తల్లి, వరండాలోంచి తండ్రి పరుగెత్తు కొచ్చారు-"ఏమయిందమ్మా?"అంటూ.

"నా కొంపే కూలిపోతున్న దిప్పుడు." గుడ్లనీరు కుక్కుతూ భర్త వ్రాసిన ఉత్తరాన్ని తండ్రి చేతిలో పెట్టుతూ, "నేను వెళతాను, నాన్నా" అంది జానకి.

"ఇప్పుడా! ఇంత అకస్మాత్తుగానా వెళ్ళడం? వారం వర్జ్యం, మంచీ చెడూ చూడకుండా లేడికి లేచిందే పరుగన్నట్లు వెళతావా? వెళ్ళవచ్చులే. ఇంతకీ ఏమని రాశాడు అల్లుడుగారు?" అడిగింది తల్లి. ఆమెకు జవాబు దశరథరామయ్యగా రిచ్చారు—"ఏమని రాశాడా నీ ముద్దుల అల్లుడు? ఇది వెంటనే బయలుదేరి రావాలట. ఇది అక్కడకు చేరడానికి ఒక రోజా పైమిచ్చాడుకూడా. ఈ పైముల్లో అమ్మాయి అక్కడకు వెళ్ళకపోతే ఇంకెప్పటికీ ఇంతే అని రాశాడు ఆత్రాష్టుడు. ఆ నాటకాల మనిషికి అంతకన్న ఇంకేం తెలుసు? వాడు చూడకపోతే నా కూతురు బ్రతక లేదనుకున్నాడు కాబోలు" అని.

"ఇది నా జీవిత సమస్య. నేను తప్పకుండా వెళతాను, నాన్నా" అంది జానకి, ఇంచుమించు ఏడుపు స్వరంతో.

"నీకు మతిగాని పోలేదు గదా? ఇప్పుడు బళ్ళేం ఉన్నాయి? కోపంలో అనేకం రాస్తారు—అన్నీ నిజమవుతాయా? రేపు అతన్నే రమ్మని టెలిగ్రామ్ ఇస్తాను. తప్పకుండా వస్తాడు" అన్నా రాయన, కూతురి తల నిమురుతూ.

"లేదు, నాన్నా! ఆయన ఒకే మాట మీద నిలిచే వ్యక్తి. రమ్మని రాశారు. చాలు. ఇచ్చిన గడువులో ఓ పూట గడిచే పోయింది. అదృష్టం ఉంటే మిగిలిన గడువులోగా అక్కడికి చేరుకోగలనేమో? టాక్సీ తీసుకురండి" అంది జానకి స్థిరమైన కంఠంతో.

"నువ్వు ఏ రోజు విన్నావు నా మాట! త్వరగా బయలుదేరు. వెళ్ళి టాక్సీ తీసుకొస్తాను" అంటూ దశరథరామయ్యగారు బయటికి వెళ్ళిపోయారు.

"ఈ రోజు మంచిది కాదమ్మా. పుట్టింటి దగ్గరి నుంచి ఆడపిల్ల భర్త దగ్గరికి వెళ్ళే రోజు మంచిదై ఉండాలమ్మా. నా మాట విను." బ్రతిమాలింది తల్లి. అష్టమి రోజున కూతుర్ని పసుపు కుంకుమలతో ఎలా పంపనా అని ఆ తల్లి బాధ. కాని, జానకి ఎవరి మాటా లక్ష్యపెట్టే స్థితిలో లేదు. ఆమె మనోనేత్రం ముందు భర్త వ్రాసిన ఉత్తరంలోని అక్షరాలే కనిపిస్తున్నాయి—'నీకు నీ భర్త కావాలని ఉంటే వెంటనే బయలుదేరి రా. నీకు ఇరవైనాలుగు గంటల వ్యవధి ఇస్తున్నాను. ఈ వ్యవధిలోగా వస్తే నన్ను పొందగలవు. వ్యవధి దాటి వస్తే నన్ను చూడలేవు'అని. అందుకే మనసులో భయంగా ఉంది. పంతాలకు పోయి కాపురానికి కీడు తెచ్చుకున్నానే అని. ఇప్పుడు ఎవ రెంత చెప్పినా వినే స్థితిలో లేదామె. వెళ్ళిపోవాలి. వెళ్ళి భర్తను క్షమార్పణ కోరాలి — ఇంకెప్పుడూ ఇటువంటి పంతాలకు, పౌరుషాలకు పోనని. అంతవరకూ తన మనసుకి శాంతి ఉండదు.

తల్లి కన్నీటినే కానుకగా ఇచ్చి కూతురిని సాగనంపింది. "ఆయనా, నేనూ వచ్చి నీ చేత దండిగా పెట్టించుకుని వెళతాములే, అమ్మా, ఇప్పటికి ఇలాగే వెళ్ళనివ్వు" అంటూ టాక్సీ ఎక్కింది జానకి. ఆమె పక్కన దశరథరామయ్య కూర్చున్నాడు గంభీర వదనంతో. మరి కొన్ని క్షణాలకు టాక్సీ రాజమండ్రి వెళ్ళే ట్రంకురోడ్డు మీద దూసుకు పోసాగింది. "ఈ రాత్రికి చేరుకోగలమా, డ్రైవర్?" మాటి మాటికి వాచీ చూసుకుంటూ అతన్ని తొందర చేస్తూనే ఉంది జానకి.



నీటిజాలు
ఫోటో — జయప్రకాష్ రెడ్డి (హైదరాబాదు-36)

కొవ్వూరు వచ్చాక కారు ముందు చక్రం బరస్టయింది. అది తీసి మరొకటి ఎక్కించేసరికి కనీసం నాలుగు గంటలన్నా పట్టి ఉంటుంది. ఏలూరులో ఒకసారి, బెజవాడలో ఓ సారి ఆగింది కారు. తండ్రి ఎంత బ్రతిమాలినా జానకి సోడానీళ్ళు కూడా ముట్టుకో లేదు. "ఇంటికెళ్ళాకే ఏం తీసుకున్నా సరే" అని అంది.

రెండు మూడు ప్రమాదాలు తప్పించుకుని టాక్సీ గూడూరు చేరుకునేసరికి కాకులు కూస్తున్నాయి.

జానకికి కుడికన్ను విపరీతంగా అదిరింది. మెడలోని నల్ల పూసల గొలుసు దానంతట అది తెగి కింద పడింది. అన్నీ అపశకునాలేను. నా అదృష్టం ఎలా ఉంటుందో అని బెంబేలు పడుతూ కారులోంచి గుమ్మంలోకి చూసింది జానకి. ఇల్లు బావురుమంటున్నట్లుగా నిశ్శబ్దంగా ఉంది.

"అబ్బాయి నిద్ర పోతున్నాడేమో?" ఆవలిస్తూ టాక్సీలోంచి దిగారు దశరథ రామయ్యగారు.

దడదడ కొట్టుకునే గుండెతో గుమ్మం ముందు వెళ్ళి నిలుచుంది జానకి. ఆమె తలుపు తట్టే లోపలే గడియ తీసుకుని ఇవతలకు వచ్చా రెవరో. అతన్ని చూస్తూనే పార్వతి అన్నయ్య ప్రకాశరావుగా గుర్తించిన జానకి సంభ్రమంగా—"మీ రెప్పుడు వచ్చా రన్నయ్యా" అంది.



అమ్మకం  చిత్రం — వై. బాలయ్య (సిద్ధిపేట)

"నేనెప్పుడు వస్తేనేంలే, అమ్మా! నీవు మాత్రం చాలా ఆలస్యం చేశావు. అది నీ జీవితానికి పూడ్చలేని లోటు" అంటూ అతను పక్కకి తప్పుకున్నాడు.

గదిలో చాపమీద నిండా ముసుగు కప్పిన ఆకారం పడి ఉంది. తల వైపు ప్రమిదలో దీపం వెలుగుతున్నది. ఆ దృశ్యం చూస్తూనే జరిగింది గ్రహించుకున్న జానకి కెవ్వున అరుస్తూ ఆ ముసుగు మీద పడిపోయింది. "ఎంత పని చేశారండీ! నేను మీ భార్య జానకిని వచ్చాను. ఒక్కసారి కళ్ళు తెరిచి చూడరూ? నన్ను క్షమించానని చెప్పరూ?" పిచ్చిదానిలా తల బాదుకుంటూ ఏడుస్తున్నది జానకి. ఆమె దుఃఖానికి అంతం లేదేమో అనిపిస్తున్నది. కాని, ఆమె దుఃఖాన్ని ఎవరు పోగొట్టగలరు? అంతా ఆమె స్వయంకృతమేను.

* • *

చెప్పడం ఆపి కళ్ళను పమిటచెంగుతో వత్తి తుడుచుకుంది జానకమ్మగారు.

"ఎంత పని జరిగింది! అయితే, ఆయన గారు ఆత్మహత్య చేసుకున్నారన్నమాట!" అనసూయ ఆమె వైపు సానుభూతిగా చూసింది.

"అంతా నా స్వయంకృతమే నమ్మా. పంతాలకు, పట్టుదలకు పోయి నా సౌభాగ్యాన్ని నేనే తుడిచేసుకున్నాను. జీవితంలో ఏ ఆడదీ చేయని అపరాధం చేశాను. శిక్ష అనుభవిస్తున్నాను. ఉత్తరం ఓ రోజు ముందు చూసినా, అనుకున్న టైముకి చేరుకున్నా నా జీవితం మరోలా ఉండేది. కాని, ఇప్పుడు పశ్చాత్తాపపడి లాభం ఏమిటి? చేతులు కాలక ముందే జాగ్రత్తపడితే చేతులు కాలే పనే ఉండదుగా?

వీణ తీగలు శ్రుతిలో ఉండి మీటితే తీయటి మధుర గానాలను పలుకుతుంది. చేతిలో బలం ఉంది కదా అని శక్తికొలదీ తీగెను బిగిస్తే శ్రుతి చెడిపోతుంది సరి కదా తీగా తెగిపోతుంది. చివరకు తీగలేని వీణే మిగులుతుంది. తీగలు లేని వీణ దేనికి పనికివస్తుంది? జీవితమూ అంతేను. తప్పులు ప్రతివారి జీవితంలోనూ జరుగుతాయి. కాని, ఆ తప్పుల్ని క్షమించగల మంచి గుణం భార్యా భర్తలు ఇద్దరిలోనూ ఉండాలి. అవి లేకపోతే ఆ సంసారంలో సుఖశాంతులు లోపిస్తాయి. సంసారాన్ని విచ్ఛేదం చేస్తాయి. పంతాలు, పట్టుదలతో చివరకు మిగిలేది ఆవేదనా, తీరని దుఃఖమూను." నిట్టూర్చింది విషాదంగా, జానకమ్మగారు.

"అందుకే నీకు చెపుతున్నాను—'పంతాలకు, పట్టుదలలకు పోయి సంసార జీవితాన్ని విచ్ఛేదం చేసుకోవద్దమ్మా' అని. ఆడదానికి ఉద్యోగమే ముఖ్యం కాదు. భర్త, సంసారం తరవాతేను అన్నీను. వెళ్ళు, తప్పకుండా వెళ్ళిపో. నీ ఇంటికి నీవు వెళ్ళడానికి ఎవరి అనుమతీ, అనుగ్రహం అక్కర్లేదు. నీ ఇంటికి నీవే రాణివి, నీ ఇంటికి వెళ్ళడానికి ఆలోచన దేనికి?" ఆగింది జానకమ్మగారు.

"తప్పకుండా వెళతాను, మేడమ్, ఈ రోజే ఈ ఉద్యోగానికి రిజైన్ చేసి ఈ రాత్రి ట్రెయిన్‌కే వెళ్ళిపోతాను. మీ కథలా నా కథ కన్నీటికథ కాకూడదు. నా జీవితం పన్నీటిజల్లుతో తేలిపోవాలి. నాకు కనువిప్పు కలిగించిన మీకు ఏమిస్తే ఋణం తీరుతుంది, మేడమ్!"

"ఏమీ ఇవ్వక్కర్లేదమ్మా. మీ దంపతులిద్దరూ సుఖంగా పది కాలాల పాటు ఉండటమే నాకు కావాలి. వెళ్ళిరా, అమ్మా!" ఆశీర్వదించింది జానకమ్మగారు.

"వస్తాను, మేడమ్. నమస్తే." అనసూయ హెడ్‌మిస్ట్రెస్ రూమ్ వైపు పరుగులాంటి నడకతో వెళ్ళిపోయింది. వెళ్ళే ఆమెను నీటి పొరలగుండా చూస్తూ సంతోషంగా నవ్వుకుంది జానకమ్మగారు. ★